కానీ ప్రియమైన బంధన, అందువలనే బంధనలో కూడా స్వతంత్రంగా ఉంటున్నారు. బాప్‌దాదా చెప్తున్నారు - భలే వచ్చారు, మీ ఇంటికి చేరుకున్నారు. మంచిది.

**నలువైపుల ఉన్న పరమ పవిత్ర ఆత్మలకు, సదా సుఖ, శాంతికి తల్లి అయిన పావనాత్మలకు, సదా పవిత్రత యొక్క శక్తి ద్వారా అనేక ఆత్మల దు:ఖం మరియు బాధను దూరం చేసే దేవాత్మలకు, సదా పరమాత్మ యొక్క విధి ద్వారా సిద్ధిని పొందే సిద్ధిస్వరూప ఆత్మలకు బాప్‌దాదా యొక్క స్నేహ సంపన్న ప్రియస్మృతులు మరియు నమస్తే.**

## శాంతి శక్తిని జమ చేసుకునే సాధనం - అంతర్ముఖి మరియు ఏకాంతవాసి స్థితి ......18-11-87

**చైతన్య శాంతిదేవ్ ఆత్మలకు శాంతి శక్తిని జమ చేసుకునే ప్రేరణ ఇస్తూ సర్వశక్తివంతుడైన బాప్‌దాదా మాట్లాడుతున్నారు:-**

ఈరోజు సర్వశక్తివంతుడైన బాప్‌దాదా తన యొక్క శక్తిసేనని చూస్తున్నారు. ఈ ఆత్మిక శక్తి సేన విచిత్రమైన సేన. పేరు ఆత్మిక సేన కానీ విశేషంగా శాంతి,శక్తినిచ్చే అహింసకసేన.కనుక ఈరోజు బాప్‌దాదా ప్రతి ఒక శాంతిదేవ్ పిల్లలని చూస్తున్నారు. ప్రతి ఒక్కరు శాంతి శక్తిని ఎంతగా జమ చేసుకున్నారు? అని.ఈ శాంతిశక్తియే ఆత్మిక సేనకి విశేష శస్త్రం. అందరూ శస్త్రధారులే కానీ నెంబర్‌వారీగా ఉన్నారు. శాంతిశక్తి మొత్తం విశ్వాన్ని అశాంతి నుండి శాంతిగా చేస్తుంది.కేవలం మనుష్యాత్మలనే కాదు కానీ ప్రకృతిని కూడా పరివర్తన చేస్తుంది. శాంతి శక్తి గురించి ఇప్పుడు మరింత గుహ్యరూపంలో తెలుసుకోవాలి మరియు అనుభవం చేసుకోవాలి. ఎంత ఈ శక్తితో శక్తిశాలిగా అవుతారో, అంతగానే శాంతిశక్తి యొక్క మహత్వాన్ని, మహానతని ఎక్కువగా అనుభవం చేసుకుంటారు. ఇప్పుడు వాక్కు శక్తి ద్వారా, సేవాసాధనాల యొక్క శకిన్తి అనుభవం చేసుకుంటున్నారు. మరియు ఈ అనుభవం ద్వారా సఫలత కూడా పొందుతున్నారు. కానీ వాణీ శక్తి లేదా స్థూలసేవ సాధనాలకంటే శాంతి శక్తి అతి శ్రేష్టమైనది. శాంతిశక్తి యొక్క సాధనాలు కూడా శ్రేష్టమైనవి. ఏవిధంగా అయితే వాక్కు శక్తి యొక్క సాధనాలు - చిత్రాలు, ప్రొజెక్టర్ లేదా వీడియో మొదలైనవి తయారు చేస్తున్నారో అదేవిధంగా శాంతిశక్తికి సాధనాలు - శుభసంకల్పాలు, శుభభావన మరియు నయనాల భాష.ఎలా అయితే నోటి భాష ద్వారా బాబా యొక్క మరియు రచన యొక్క పరిచయం ఇస్తున్నారో, అదేవిధంగా శాంతిశక్తి ఆధారంగా, నయనాల యొక్క భాష ద్వారా, నయనాల ద్వారా బాబా యొక్క అనుభవం చేయిస్తున్నారా! ఎలా అయితే ప్రొజెక్టర్ ద్వారా చిత్రాలు చూపిస్తారో అదేవిధంగా మీ మస్తకంలో మెరుస్తూ మీ యొక్క మరియు బాబా యొక్క చిత్రాన్ని స్పష్టంగా చూపించగల్గుతున్నారా! ఎలా అయితే వర్తమాన సమయంలో వాక్కు ద్వారా స్మృతియాత్ర యొక్క అనుభవం చేయిస్తున్నారో అదేవిధంగా శాంతిశక్తి ద్వారా మీ ముఖం ద్వారా రకరకాల స్మృతి యొక్క స్థితులు స్వతహాగా అనుభవం చేయించాలి. అనుభవం చేసుకునే వారు ఈ సమయంలో బీజరూప స్థితి అనుభవం అవుతుంది లేదా

Created by Universal Document Converter

ఫరిస్తారూపం యొక్క అనుభవం అవుతుంది లేదా రకరకాల గుణాల యొక్క అనుభవం అవుతుంది అని సహజంగా అనుభవం చేసుకుంటారు. ఇలా మీ శక్తిశాలి ముఖం ద్వారా స్వతహాగానే అనుభూతి జరుగుతూ ఉంటుంది.

ఎలా అయితే వాక్కు ద్వారా ఆత్మలకు స్నేహం మరియు సహయోగం యొక్క భావనను ఉత్పన్నం చేస్తున్నారో అదేవిధంగా మీ యొక్క శుభభావన, స్నేహభావన యొక్క స్థితిలో వారు కూడా స్థితులౌతారు. మీ భావన ఎలా ఉంటుందో వారిలో కూడా అదే భావన ఉత్పన్నం అవుతుంది. మీ శుభభావన వారి భావనను ప్రజ్వలితం చేస్తుంది. ఎలా అయితే దీపం ద్వారా దీపాన్ని వెలిగిస్తారో అదేవిధంగా మీ శక్తిశాలి శుభభావన ఇతరులలో కూడా సర్వశ్రేష్ఠ భావనను సహజంగానే ఉత్పన్నం చేస్తుంది. ఏవిధంగా అయితే వాక్కు ద్వారా ఇప్పుడు మొత్తం స్థూలకార్యం చేస్తున్నారో అదేవిధంగా శాంతిశక్తి యొక్క శ్రేష్టసాధనమైన శుభసంకల్పశక్తి ద్వారా కూడా స్థూలకార్యం సహజంగా చేయగలరు మరియు చేయించగలరు. ఎలా అయితే విజ్ఞాన సాధనాలు టెలిఫోన్, వైర్‌లెస్ మొదలైనవో అదేవిధంగా ఈ శుభ సంకల్పం ద్వారా సన్ముఖంగా మాట్లాడుతున్నట్లు లేదా టెలిఫోన్, వైర్‌లెస్ ద్వారా కార్యం చేస్తున్నట్లు అనుభవం చేయిస్తుంది. శాంతి శక్తికి చాలా విశేషతలు ఉన్నాయి. శాంతిశక్తి తక్కువైనది కాదు. కానీ ఇప్పుడు వాక్కు శక్తిని, స్థూల సాధనాలను ఎక్కువగా కార్యంలో ఉపయోగిస్తున్నారు. అందువలన అది సహజంగా అనిపిస్తుంది. శాంతిశక్తి యొక్క సాధనాలను ప్రయోగంలోకి తీసుకురాలేదు అందువలన వీటి అనుభవం లేదు. అది సహజమనిపిస్తుంది మరియు ఇది కష్టంగా అనిపిస్తుంది. కానీ సమయపరివర్తన ప్రమాణంగా ఈ శాంతిశక్తి యొక్క సాధనాలను ప్రయోగంలోకి తీసుకురావల్సి వస్తుంది.

అందువలన, ఓ శాంతిదేవ్ శ్రేష్ట ఆత్మలూ! ఈ శాంతిశక్తిని అనుభవంలోకి తీసుకురండి. ఎలా అయితే వాక్కు యొక్క అభ్యాసం చేస్తూ, వాక్కులో శక్తిశాలి అయిపోయారో అదేవిధంగా శాంతిశక్తి యొక్క అభ్యాసిగా కూడా అవ్వండి. మున్ముందు ముందు వాక్కు ద్వారా లేదా స్థూలసాధనాల ద్వారా సేవ చేసే సమయం లభించదు. ఆ సమయంలో శాంతిశక్తి యొక్క సాధనాలు అవసరం అవుతాయి. ఎందుకంటే ఎంత గొప్ప శక్తిశాలి శస్త్రం ఉంటుందో అంత అది తక్కువ సమయంలో ఎక్కువ కార్యం చేస్తుంది. మరియు ఎంత మహాన్‌గా, శక్తిశాలిగా ఉంటుందో అంత అతి సూక్ష్మంగా ఉంటుంది. వాణీ కంటే శుద్ధ సంకల్పాలు సూక్ష్మమైనవి అందువలన సూక్ష్మం యొక్క ప్రభావం శక్తిశాలిగా ఉంటుంది. ఇప్పుడు కూడా అనుభవీలే, ఎక్కడైతే వాక్కు ద్వారా కార్యం సిద్ధి అవ్వదో అప్పుడు ఇక వీరు వాక్కు ద్వారా అర్థం చేసుకోరు, శుభభావన ద్వారా పరివర్తన అవుతారు అని అంటారు కదా! ఎక్కడ వాక్కు ద్వారా కార్యం సఫలం అవ్వదో, అక్కడ శాంతి శక్తి యొక్క సాధనాలైన శుభ సంకల్పం, శుభ భావన, నయనాల భాష ద్వారా దయ మరియు స్నేహం యొక్క అనుభూతి కార్యాన్ని సిద్ధి చేస్తుంది. ఇప్పుడు కూడా ఎవరైనా వాదన చేసేవారు వస్తే కనుక వారు వాణీ ద్వారా ఇంకా ఎక్కువ వాదనలోకి వచ్చేస్తారు కనుక వారిని స్మృతిలో కూర్చోబెట్టి శాంతిశక్తి యొక్క అనుభవం చేయిస్తారు కదా! ఒక సెకను అయినా వారికి స్మృతి ద్వారా శాంతిశక్తి యొక్క అనుభవం చేయిస్తే వారే తమ వాదవివాదాల బుద్ధిని శాంతిశక్తి యొక్క అనుభూతి ముందు సమ్పూరణ చేసేస్తారు. కనుక ఈ శాంతిశక్తి యొక్క అనుభూతిని పెంచుకుంటూ వెళ్ళండి. ఇప్పుడు ఈ శాంతిశక్తి యొక్క అనుభూతి చాలా తక్కువగా ఉంది. శాంతి శక్తి యొక్క రసాన్ని ఇప్పటివరకు

Created by Universal Document Converter

చాలా మంది కేవలం బిందు మాత్రంగా అనుభవం చేసుకున్నారు. ఓ శాంతిదేవ్ ఆత్మలు - మీ భక్తులు మీ జడచిత్రాల ముందు శాంతి యొక్క అల్పకాలిక అనుభవం చేసుకుంటున్నారు. ఎక్కువమంది అడిగేది కూడా శాంతినే. ఎందుకంటే శాంతిలోనే సుఖం నిండి ఉంటుంది కనుక బాప్‌దాదా శాంతిశక్తి యొక్క అనుభవీ ఆత్మలు ఎంతమంది ఉన్నారు, వర్ణన చేసేవారు ఎంతమంది ఉన్నారు మరియు ప్రయోగం చేసేవారు ఎంతమంది ఉన్నారు అనేది చూస్తున్నారు. దీనికొరకు " అంతర్ముఖి" మరియు " ఏకాంతవాసి " అవ్వాలి. బాహర్ముఖతలోకి రావటం సహజమే కానీ ఇప్పుడు సమయప్రమాణంగా అంతర్ముఖత యొక్క అభ్యాసం చాలా ఉండాలి. కొంతమంది పిల్లలు ఏకాంతవాసి అవ్వటానికి సమయం దొరకటంలేదు అంతర్ముఖ స్థితిని అనుభవం చేసుకోవడానికి సమయం దొరకటంలేదు ఎందుకంటే సేవా ప్రవృత్తి మరియు వాక్కు శక్తి యొక్క ప్రవృత్తి చాలా పెరిగిపోయింది అంటున్నారు కానీ దీనికొరకు వేరుగా అరగంట లేదా గంట సమయం తీయాల్సిన అవసరం లేదు. సేవా ప్రవృత్తిలో ఉంటూ కూడా మధ్యమధ్యలో సమయం లభించినప్పుడు ఏకాంతవాసి అయ్యే అభ్యాసం చేయండి.

ఏకాంతవాసి అంటే ఏదోక శక్తిశాలి స్థితిలో స్థితులవ్వటం. బీజరూపి స్థితిలో స్థితులవ్వండి, లైట్‌హౌస్. మైట్‌హౌస్ స్థితిలో స్థితులవ్వండి అంటే విశ్వానికి లైట్ - మైట్ ఇస్తున్నాను అనే ఈ అనుభూతిలో స్థితులవ్వండి. ఫరిస్తా స్థితి ద్వారా ఇతరులకి కూడా అవ్యక్తస్థితి యొక్క అనుభవం చేయించండి. ఒక సెకను లేదా ఒక నిమిషం అయినా ఈ స్థితిలో ఏకాగ్రంగా స్థితులైతే అది స్వయానికి మరియు ఇతులకి కూడా చాలా లాభాన్నిస్తుంది. దీనికి అభ్యాసం కావాలి. ఇప్పుడు ఒక సెకను కూడా ఖాళీ దొరకని వారు ఎవరైనా ఉన్నారా? మొదట్లో ట్రాఫిక్ కంట్రోల్ ప్రోగ్రామ్ పెట్టినప్పుడు కొందరు ఇది ఎలా కుదురుతుంది అని ఆలోచించేవారు. సేవాప్రవృతి చాలా పెద్దది కదా, బిజీగా ఉంటాము కదా అనుకునేవారు కానీ లక్ష్యం అయితే పెట్టుకున్నారు కనుక చేయగల్గుతున్నారు కదా! ఈ ప్రోగ్రామ్ నడుస్తుంది కదా! సేవాకేంద్రాలలో ఈ ట్రాఫిక్ కంట్రోల్ ప్రోగ్రామ్ నడుస్తుందా లేదా అప్పుడప్పుడు చేయటం, అప్పుడప్పుడు మిస్ చేస్తున్నారా? ఇది బ్రాహ్మణకులం యొక్క విధానం మరియు నియమం. ఎలా అయితే ఇతర నియమాలు అవసరం అని భావిస్తున్నారో అదేవిధంగా ఇది కూడా స్వఉన్నతి కొరకు, సేవా సఫలత కొరకు మరియు సేవాకేంద్రం యొక్క వాతావరణం తయారుచేయటానికి చాలా అవసరం. ఈ విధంగా అంతర్ముఖి, మరియు ఏకాంతవాసి అయ్యే అభ్యాసం యొక్క లక్ష్యం పెట్టుకుని మీ మనస్సు యొక్క సంలగ్నతతో మధ్యమధ్యలో సమయం తీయండి. దాని గొప్పతనం తెలుసుకున్నవారికి స్వతహాగానే సమయం లభిస్తుంది. గొప్పతనం తెలియకపోతే సమయం కూడా లభించదు. ఒకే శక్తిశాలి స్థితిలో మీ మనస్సు మరియు బుద్ధిని స్థితులు చేయటమే ఏకాంతవాసి అవ్వటం. బ్రహ్మాబాబాని చూసారు కదా, సంపూర్ణత యొక్క సమీపతకి గుర్తు - బాబా సేవలో ఉంటూ, సమాచారం వింటూ కూడా ఏకాంతవాసి అయిపోయేవారు. ఈ అనుభవం చేసుకున్నారు కదా! ఒక గంట యొక్క సమాచారాన్ని కూడా 5 నిమిషాలలో సారం గ్రహించి పిల్లలని కూడా సంతోషపరిచేవారు మరియు తన అంతర్ముఖి మరియు ఏకాంతవాసి స్థితిని కూడా అనుభవం చేసుకునేవారు. సంపూర్ణతకు గుర్తు - అంతుర్ముఖి మరియు ఏకాంతవాసి స్థితిని నడుస్తూ, తిరుగుతూ, అన్నీ వింటూ మరియు అన్నీ చేస్తూ కూడా అనుభవం చేసుకున్నారు. మరి బ్రహ్మాబాబాని అనుసరించటం లేదా? బ్రహ్మాబాబా కంటే ఎక్కువ

Created by Universal Document Converter

బాధ్యతలు ఎవరికైనా ఉన్నాయా? బ్రహ్మాబాబా ఎప్పుడూ నేను చాలా బిజీ (హడావడి)గా ఉన్నాను అని అనలేదు. కానీ పిల్లలముందు ఉదాహరణ అయ్యారు. ఇప్పుడు సమయప్రమాణంగా ఈ అభ్యాసం అవసరం. సేవాసాధనాలు ఉన్నప్పటికీ కూడా శాంతిశక్తి యొక్క సేవ అవసరం ఎందుకంటే శాంతిశక్తి అనుభూతి చేయించే శక్తి. వాక్కు శక్తి యొక్క బాణం బుద్ధి వరకు వెళ్తుంది మరియు అనుభూతి యొక్క బాణం మనస్సు వరకు వెళ్తుంది. ఇప్పుడు సమయప్రమాణంగా ఒక సెకనులో అనుభూతి చేయిచండి అనే పిలుపు వినపడుతుంది. వినటం మరియు వినిపించటంతో అలసిపోయారు. శాంతిశక్తి యొక్క సాధనాల ద్వారా దృష్టి ద్వారా అద్భుతం చేయగలరు. శుభసంకల్పం ద్వారా ఆత్మల వ్యర్ధసంకల్పాలని సమాప్తి చేయగలరు. శుభభావన ద్వారా బాబాపై స్నేహ భావనను ఉత్పన్నం చేయగలరు. ఆ ఆత్మలను శాంతిశక్తి ద్వారా సంతుష్టం చేస్తారు అప్పుడు చైతన్య శాంతిదేవ్ ఆత్మలైన మీ ముందుకి వచ్చి శాంతిదేవ్, శాంతిదేవ్! అంటూ మహిమ చేస్తారు మరియు ఇదే అంతిమ సంస్కారంగా తీసుకువెళ్ళిన కారణంగా ద్వాపరయుగంలో భక్తి ఆత్మలుగా అయ్యి మీ జడచిత్రాల ముందు ఈ మహిమ చేస్తారు. ట్రాఫిక్ కంట్రోల్ యొక్క గొప్పతనం ఎంత ఉన్నతమైనది మరియు ఇది ఎంత అవసరం అనే దాని గురించి తర్వాత చెప్తాను కానీ శాంతిశక్తి యొక్క గొప్పతనాన్ని స్వయం తెలుసుకోండి మరియు సేవలో ఉపయోగించండి.

**నలువైపుల ఉన్న శాంతిదేవ్ శ్రేష్ఠాత్మలకు, నలువైపుల ఉన్న అంతర్ముఖి మహానాత్మలకు, సదా ఏకాంతవాసి అయ్యి కర్మలోకి వచ్చే కర్మయోగి శ్రేష్ఠాత్మలకు, సదా శాంతిశక్తిని ప్రయోగించే శ్రేష్ఠయోగి ఆత్మలకు బాప్‌దాదా యొక్క ప్రియస్మృతులు మరియు నమస్తే.**

## సహాయసాగరుని నుండి కోటానుకోట్ల సహాయం తీసుకునే విధి....22-11-87

**నిర్బలంగా ఉన్నవారిని శక్తివంతులుగా తయారుచేసే, సహాయసాగరుడైన బాప్‌దాదా తన యొక్క ధైర్యవంతులైన పిల్లలతో మాట్లాడుతున్నారు:-**

ఈరోజు బాప్‌దాదా నలువైపుల ఉన్న తన యొక్క ధైర్యవంతులైన పిల్లలను చూస్తున్నారు. ఆది నుండి ఇప్పటివరకు ప్రతి ఒక్క బ్రాహ్మణాత్మ ధైర్యం ఆధారంగా బాప్‌దాదా యొక్క సహాయానికి పాత్రులుగా అవుతుంది మరియు "ధైర్యం ఉన్న పిల్లలకు బాబా సహాయం చేస్తారు" అనే వరదానాన్ని అనుసరించి పురుషార్ధంలో నెంబర్‌వారీగా ముందుకి వెళ్తున్నారు. పిల్లల ఒక అడుగు యొక్క ధైర్యం మరియు బాబా యొక్క కోటానుకోట్ల అడుగుల యొక్క సహాయం ప్రతి బిడ్డకి లభిస్తుంది. ఎందుకంటే ఇది బాప్‌దాదా యొక్క ప్రతిజ్ఞ అనండి లేదా వారసత్వం అనండి పిల్లలందరికీ లభిస్తుంది మరియు ఈ శ్రేష్ట మైన సహజప్రాప్తి కారణంగానే 63 జన్మల నుండి నిర్బలంగా ఉన్న ఆత్మలు శక్తివంతులుగా అయ్యి ముందుకి వెళ్తున్నారు. బ్రాహ్మణ జన్మ తీసుకుంటూనే మొదట ఏవిషయంలో ధైర్యం చేసారు? మొదటి ధైర్యం - అసంభవాన్ని సంభవం చేసి చూపించారు, పవిత్రత యొక్క విశేషతను ధారణ చేసారు. మేము పవిత్రంగా అవ్వవలసిందే అని ధైర్యంతో దృఢసంకల్పం చేసారు మరియు మీరు ఆదిలో మరియు అనాదిగా పవిత్రంగా ఉండేవారు,

Created by Universal Document Converter